# శత్రుభీతి లేకుండ జీవించుటెట్లు

2 రాజులు 6:8-15 "దైవజనుడైన అతని పనివాడు పెందలకడలేచి బయటకు వచ్చినప్పుడు గుఱ్ఱములును, రథములును గల సైన్యము పట్టణమును చుట్టుకొని యుండుట కనబడెను". 2 రాజులు 6:15. సేవకుడు వేకువనే లేచుట ఎలీషా నేర్పించెను. ఈ రీతిగా యే దిన కార్యక్రమము నాదినము ముగింపవలెను. తమ అంతఃపుర రహస్యమును వెల్లడి పరచుచున్న ప్రవక్తను తప్పక పట్టుకొన గలమను నిశ్చయతతోనే ఆరాము సైన్యము దోతామును ముట్టడివేసెను. అంతట ఆ పనివాడు బహు భయముతో కేకలిడుచున్నాడు. "అయ్యో, నా యేలినవాడా మనమేమి చేయుదుము?" అని దైవజనునితో అనగా 2 రాజులు 6:15. ప్రవక్త ద్వారా దేవుడింతవరకు చేసిన ఘనకార్యములను జ్ఞప్తియందుంచుకొనినచో పైరీతిని సేవకుడు కేకలిడ యుండడు. ఇతరులను ప్రవక్తద్వారా రక్షించిన దేవుడు తన ప్రవక్తను తన్నుకూడ రక్షించునని, సున్నతిలేని వానిచేతిలో పడనియ్యడనియు నమ్మియుండును. తను గూర్చి ఆలోచించి నేనేమి చేయవలయుననిన బాగుండియుండును.

క్రీస్తు ప్రభువు శిష్యులవలె "బోధకుడా! మేము నశించుపోవుచున్నాము. మనమేమి చేయుదుము?" అని ప్రవక్తను గూర్చియు మాట్లాడుచున్నాడు. విరుద్ధ పరిస్థితులలో యీ కేకనే ప్రతి విశ్వాసియు వేయుచున్నాడు. ప్రభువు కొరకు అనేక ఘనకార్యములను చేసి ఘనమైన రీతిని ఆయన కొరకు మనము వాడబడకుండ భయము అనేక విశ్వాసుల నడ్డగించుచున్నది. ప్రజాభిప్రాయము యెడల గౌరవము మనలను భయకంపితులను చేయుచున్నది. మనలను గూర్చి ఎట్టి దుష్ప్రచారము చేయుదురా? యను భయము మనలను వెంటాడుచున్నది. సంశయము భయముఈ రెండును సాతానుయొక్క రెండు ఆయుధముల్లై యున్నవి.విశ్వాసులలో ధైర్యము, శాంతి సమాధానములను నెలకొల్పుట దేవుని ప్రేమ కార్యమైయున్నది. అనేకుల నుండి మనము తరచుగా వినునదేది? "నేను కార్యమును తప్పక చేయుదును" అయితే భయపడుచున్నాను. ఎలీషాయైతే దైవచిత్తమని గ్రహించినదానిని చేయుటకు భయపడలేదు. పౌలు కూడ వెనుకాడుటలేదు. దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధి యెవడు? రోమా 8:31. మనము దేవుని బిడ్డలమైతే దేవుడు తప్పక మన పక్షమున నుండును. మన విరోధులతో ఆయన తప్పక పోరాడును. ప్రతి ప్రమాదమునుండి, కీడునుండి మనలను భద్రపరచును. ఒక పిచ్చుక నశించుట దేవుని కెరుకయైతే మన తలవెంట్రుకలలో ఒకటి రాలుట ఆయన దృష్టించియున్నాడు. మనము భయపడుటకు కారణమేమున్నది. మన చింతయావత్తు ఆయనకెరుకయై యున్నది. ఆయన మన శ్రేయస్సును కోరుదేవుడైయున్నాడు. ప్రతి క్లిష్టపరిస్థితులలో ఆయన మనకు తోడైయున్నాడు.

## 1. శత్రువుల వలన భయములేకుండ మనము జీవించుటెట్లు?

భీతిల్లి కేకలిడిన సేవకుని ప్రవక్త నెమ్మదిపరచి యున్నాడు. ఆ విధమును కొంత ధ్యానింతము. “భయపడవద్దు" అని సేవకుని ఆదరించెను. 2 రాజులు 6:16. భయకంపితుడైన సేవకుని జీవితమునకు ప్రవక్తయైన ఎలీషా జీవితమునకు మధ్య ఎంత తారతమ్యమున్నదో ఒకసారి గుర్తించుము. సేవకుడు పిరికివాడు; ప్రవక్త బహు ధైర్యశాలి. సేవకుడు తత్తరపాటులో నిండిన వాడు. ప్రవక్త చలనములేని స్థితి, ఆత్మీయ నిశ్చలత. దేవుని సైన్యము తనతో గలదను

విశ్వాసము గలిగినవాడు. దేవుడు పరలోక సైన్యము తానున్న పర్వతముచుట్టు కావలి కాచినదని ప్రవక్త చూడగలిగెను. “భయపడవద్దు" అను మాట పరిశుద్ధ గ్రంథమున మూడువందల అరువదియైదు సార్లు లిఖింపబడియున్నది. కావున విశ్వాసీ భయపడవద్దు. మీతో ఉన్నవాడు లోకములో ఉన్నవానికంటె గొప్పవాడు. గనుక మీరు వారిని జయించియున్నారు." 1 యోహాను 4:4. దేవుడుమన పక్షమున నుండగా మనకు విరోధి యెవడు? రోమా 8:31. ఆయన కృపనుబట్టి మనము ఈ వాగ్దానముపై ఆధారపడుచున్నాము. దేవుడు "మనలోనే గాక మనచుట్టు నుండగా మనమెందుకు భయపడవలయును? నీ స్వజనులే నిన్ను పరాయివానిగా నెంచవచ్చును, స్నేహితులే విరోధులై నీపై వైరముతో బాధింపవచ్చును. పరిస్థితిలే విరుద్ధమై నిన్ను అరికట్టవచ్చును, ఆత్మబంధువే స్వార్థపరుడై నిన్ను పాడుచేయ యత్నించవచ్చును. అయిననూ భయమేల? ప్రభు క్రీస్తునాథుని ప్రేమ వాక్కులను వినుము. "భయపడక నమ్మిక మాత్రముంచుము, నిన్ను ఏమాత్రమును విడువను. నిన్ను యెన్నడును యెడబాయను అని ఆయనయే చెప్పెను కదా" హెబ్రీ 13:15. "మీ హృదయమును కలవరపడనివ్వకుడి". యోహాను 14:1. ఎవరైతే దేవుని కొరకు నిలువబడెదరో వారిని దేవుడెన్నడును విడనాడలేదు.”

దేవుని నామమును మహిమపరచుటకై అగ్నిగుండములో నిలచిన యువకులను ఒకసారి మదికి తెచ్చుకొనుము. వారితో కూడ ఆయన నిలచెను గదా. దానియేలు 2:20. దేవుని మహిమపరచుటకై సింహపు బోనులో వేయబడిన దానియేలు సింహముల వలన ఆవరింపబడి యుండగా భద్రపరచినదెవరు? దానియేలు 6:20-23. ప్రస్తుతము శత్రు సమూహము వలన చుట్టు వరింపబడిరి. ఎలీషాను మదికి తెచ్చుకొనుము. ఎవరైతే దేవుని యెదుట యథార్థ హృదయులై ఆయనను సేవించెదరో వారి పక్షముగా దేవుని నిలచి పోరాడును గనుక భయపడకుము. యెహోషువతో చెప్పినట్లే యీ దినములలో మనతోనిట్లు చెప్పుచున్నాడు. "నిన్ను విడువను, నిన్ను ఎడబాయను. నిబ్బరము కలిగి ధైర్యముగా నుండుము". యెహోషువ 1:6.

ప్రియ ప్రభువు మనతో నున్నచో అపవాది మనలనెంతగా బలహీనపరచ జూచినను మనము బలహీనపరచబడము. ఆహా! తన యజమానుని చెంతను ఆయన సన్నిధిలో నున్న సేవకుడెంత క్షేమముగా నుండును. అట్లే క్రీస్తునాథుని చెంతను, సహవాసమున నున్న సేవకులమైన మన జీవితములెంత ధన్యమైనవి? మన ప్రభువులోనే మనకు బలము! ధైర్యము!! శక్తి!!! క్షేమము గలదు. మన ప్రభువు మనతో "నిన్ను ఏ మాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను" అని ఆయనయే చెప్పెను గదా! కాబట్టి ప్రభువు నాకు సహాయకుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు?" అని మంచి ధైర్యముతో చెప్పగలవారమై యున్నాము. హెబ్రీ 13:5-6.

## 2. మన పక్షమున నున్నవారు వారికంటే అధికులై యున్నారని, చెప్పి దేవుని బలమును వివరించెను.

2 రాజులు 6:10. ప్రవక్త సేవకుడు శత్రువు సైన్యమును మాత్రమే చూచియున్నాడు. ఎలీషాయైతే దేవుని సైన్యమును ఆత్మదృష్టిలో చూడగలిగియున్నాడు. అందుచేత సేవకుని యిట్లు ధైర్యపరచుచున్నాడు. “ఇదిగో నీవు భయపడవద్దు మనలను కాపాడుటకై మనతో నున్నవారు మనలను పాడుచేయుటకై మనకు విరోధముగా నున్నవారి కంటె అధిక

సంఖ్యాకులైయున్నారు. దేవదూతలు బహు సంఖ్యాకులు, దేవుని శక్తి మహాగొప్పది. ప్రియుడా, శత్రుసమూహము మనలను ఆవరించి యుండగా ఏకాకిగా పోరాడవలసిన అనుభవములు గలవు. ఈ పరిస్థితులలో ఒంటరిస్థితి నాలోచించి నేను ఒంటరిగా యున్నాను, బలహీనునిగా యున్నాను. నా గతియెట్లు? అని నీవు తలంచుచున్నావా?

ఇదిగో దైవజనుని యనుభవము ధ్యానించుము. రాజైన అహాబు, యెజెబెలు రాణితో పోరాటమునకు పిదప ప్రవక్తయైన ఏలీయా నేనొక్కడనే దేవుని పక్షముగా నిలచియున్నానని తలంచగా దేవుని జవాబు వినుము. “ఇశ్రాయేలు వారిలో బయలునకు మోకాళ్ళూనకయు నోటితో వాని ముద్దుపెట్టుకొనకయు నుండు ఏడువేలమంది నాకు మిగిలియున్నారు." 1 రాజులు 19:18. ఆయా సమయములందు మన బలహీన దృష్టి దైవదర్శనము మరుగుచేయును. పోరాటము విశ్వాసిది మాత్రమేకాదు. మన దేవునిదియునై యున్నది. మరియు దైవపోరాటమున నున్న వారందరు ప్రార్థన సహవాసములో యేకీభవించు చున్నారు. నిరుత్సాహముతో నిండియున్న సేవకుని దృష్టిని తెరచి అతని పక్షముగానున్న అగ్నిరథములను గుఱ్ఱములను చూపి బలపరచియున్నాడు. విరోధులు గెత్సేమనే వనములో క్రీస్తునాథుని ఒంటిరిగా చూచిరి గాని ప్రభువు పన్నెండు సైన్యసమూహములు కంటే ఎక్కువమంది దూతలను చూచెను.

“ఇంతగొప్పసాక్షి సమూహము మేఘమువలెమనలను ఆవరించి యున్నందున మనకు భయమేల?" హెబ్రీ 12:1. మరియొక విషయమును ప్రతి దైవజనుడును గుర్తింపవలయును. మనలో నున్నవారు శత్రు సమూహముల కంటె బహు అల్పసంఖ్యాకులై యుండవచ్చును. అయినను వేలాదివేల శత్రువుల కంటె బలవంతులు లెక్కకు మిడుతల వలె నున్న 2500 మంది మిద్యానీయులను 300మందితో గిద్యోను జయించెను.న్యాయాధి 7:7. 318 సేవకులతో అబ్రాహాము ఐదుగురు శత్రురాజుల సేనలను ఓడించెను. ఆది. 14:1-14. క్రీస్తులేని కోట్ల సమూహము కంటె క్రీస్తును తమ నాయకునిగా గల ఒంటరియే బలవంతుడు. "దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధి యెవడు?" రోమా 8:31.

## 3. ఎలీషా తన సేవకుని కొరకు ప్రార్థించెను

ఎలీషా ప్రార్థన చేయగా" 2 రాజులు 10:17. భయకంపితుడైన సేవకుని కొరకు ఎలీషా చేసిన ప్రార్థన ఫలించెను. ప్రియుడా, మన గొప్ప ప్రధాన యాజకుడు మన కొరకు ప్రార్థించుచున్నాడు.ఆయన అపవాది వలన అపజయము నొందినవాడు కాడు. శత్రువుని తన యిష్టానుసారముగావదరనిమ్ము; పన్నాగము పన్ననిమ్ము. నీ కొరకు విజ్ఞాపనము చేయుటకు గాను ఆయన నిరంతరము జీవించియున్నాడు. భీతినుండి మనలను విడుదల చేయునని దేవుని కృపా కటాక్షములు మాత్రమే. ఇవి మన ప్రధాన యాజకుడైన క్రీస్తు విజ్ఞాపనముల మూలముగా మనకు లభించుచున్నవి, పోరాటములో నున్న యాత్రికుల పక్షమున ఆయన చేయు విజ్ఞాపన ఘనమైనది. లేనిచో ఆయన భక్తులు ఒకరైనా లేకుండ నశించియే యుందురు. నీ కొరకై ఆయన శిలువపై తన ప్రాణమును పెట్టిన ప్రియ క్రీస్తునాథుడు అట్టి ప్రేమతో నీ కొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు. నిన్ను ప్రేమింపకుండ ఆయన యెట్లుండ గలడు? ఆహా, క్రీస్తుయేసు మన విమోచకుడు మాత్రమేకాదు ఆయన మన ప్రధాన యాజకుడు. మన ప్రధాన యాజకుడు మాత్రమే కాదు ఆయన మన ప్రధాన కాపరియైయున్నాడు. ఇంత గొప్ప క్రీస్తు మనకుండగా మనమెందుకు అపవాదితంత్రములకు భీతిల్లవలయును?

దుఃఖము, ఇరుకులలోను ఉన్నవారలారా యెందుకు భీతిల్లెదరు? ఆయన జయించని విరుద్ధ పరిస్థితిగాని శక్తిగాని లేనేలేదుగదా? ఆయన విజయము మన విజయమే!

## 4. ఎలీషా సేవకుని విశ్వాస నేత్రములు తెరవబడెను

సేవకుడు ప్రకృతి సంబంధమైన నేత్రములతో శత్రుసమూహమును వారినుండి కలుగు ప్రమాదమును జూచెను. ఎలీషా యెహోవాకు ప్రార్థించి అతని ఆత్మనేత్రములను విప్పెను. యెహోవా "వీడు చూచునట్లు దయచేసి వీని కండ్లను తెరువుమని ఎలీషా ప్రార్థనచేయగా యెహోవా ఆ పనివాని కండ్లను తెరువజేసెను." సేవకుని విశ్వాస నేత్రములు తెరువబడగా వాని చుట్టూ నున్న దేవుని సేనను చూడగలిగెను. "గనుక వాడు ఎలీషాచుట్టును పర్వతము, అగ్ని గుఱ్ఱములచేతను రథములచేతను నిండియుండుట చూచెను". 2 రాజులు 6:17.

గుండె చెదరినవారి విశ్వాస నేత్రములెప్పుడు తెరువబడునో అప్పుడే అతని భయము యావత్తు అంతరించును. అంధకారములో మనము భీతుల్లుట సహజము; పరలోక ప్రభావము యొక్కయు అధిపత్యము యొక్కయు వివిధమైన దృశ్యము మనకెప్పుడు కలుగునో అప్పుడు యీ భూసంబంధ విషయమైన బాధల వలన భయము లన్నియు పూర్తిగా అంతరించును. సేవకుని నేత్రములు తెరువబడెను. ఆరాము సైన్యము కంటే బలమైన సైన్యమును చూడగలిగెను. “గనుక వాడు ఎలీషా చుట్టును పర్వతము అగ్నిగుర్రములచేతను, రథములచేతను నిండియుండుట చూచెను”. 2 రాజులు 6:17. అగ్ని భయంకరమైనది. దహించునది. అందుచేత ప్రవక్త పక్షముగా దేవుడు నియమించిన కాపుదల విరోధులను భీతిల్లచేసి దహింపగలిగినది. దూతలు దేవుని వార్తావాహనము, దేవుని సైన్యము. ఆది 32:2. తన ప్రజల క్షేమార్థమైన సైన్య సమూహము. ఎలీషా చుట్టును అగ్నిరథములు, గుర్రములలో దేవుడు కాపుదల నుంచినట్లుగా దేవుని చిత్తములో నున్నవారి చుట్టును దేవుడు తన కాపుదల నుంచెను. శత్రువు తన బాణములను వేసినను దేవుని కాపుదల కంచెకు తగిలి పూలదండగా మారును. పోతీఫరు యింటనున్న యోసేపును సాతాను ముట్టజూచెను. దేవుడు అయితే కారాగారమున నున్న యోసేపును కిరీటధారిగా జేసెను. దేవుని చిత్తముననున్న యోబును గూర్చి సాతాను మాటలను యోచించుము. “అతని యింటివారిని అతనికి కలిగిన సమస్తము నకును చుట్టు కంచె వేసితివిగదా? "యోబు 1:10. శారా దైవ సంకల్పమున నున్నందున ఐగుప్తురాజుఅబీమెలకువలన వచ్చిన శోధనతో అతడామెను ముట్టకుండ దేవుడే కాపాడెను ఆది 20:6. "మహోన్నతుని చాటున నివసించు వాడే సర్వశక్తుని నీడను విశ్రమించువాడు. ఆయనే నాకు ఆశ్రయము నా కోట" కీర్తన 91:1-2. నీ ప్రక్కను వేయిమంది కూలినను అపాయము నీ యొద్దకు రాదు. నీ మార్గములన్నిటిలో నిన్ను కాపాడుటకు ఆయనే నిన్ను గూర్చి తన దూతల కాజ్ఞాపించును. కీర్తన 91:7-11.